## క్లుప్తంగా

### తిరుపతిలో కార్డన్ సెర్చ్



రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసులు

**తిరుపతి క్రైం:** ప్రజలు నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు ఆదివారం వేకువజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్, టౌన్ క్లబ్ ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వేకువజామున 4 గంటల నుంచి పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని, ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నివాసం ఉంటున్న వారి ఆధార్ కార్డులు సేకరించి, వివరాలను, చిరునామాను అడిగి తెలుసుకున్నారు. స్థానికులెవరు? స్థానికేతరుల వివరాలను సేకరించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ధ్రువపత్రాలు, నంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### పది పరీక్షలకు సర్వం సిద్ధం

**చంద్రగిరి:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం మండలవ్యాప్తంగా 7 సెంటర్లను ఎంపిక చేసినట్లు ఎంఈఓ లలిత కుమారి తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల-232, బాలుర ఉన్నత పాఠశాల-240, జెడ్పీహెచ్ఎస్ ఏ.రంగంపేట - 70, జెడ్పీహెచ్ తొండవాడ - 195, జెడ్పీహెచ్ఎస్ పనపాకం - 64, శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమి -164, శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ 134 మందితో కలసి మొత్తం 1100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు విద్యార్థులకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల నుంచి 100 మీటర్ల వరకు ఎవరికి ఎటువంటి అనుమతులు లేవని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆమె తెలిపారు. పరీక్ష సమయానికి విద్యార్థులంతా తప్పకుండా హాజరుకావాలని ఆమె సూచించారు. కేంద్రాల వద్ద మంచి నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స, ఫ్యాన్లు, లైట్ల సౌకర్యాలను సైతం కల్పించినట్లు ఆమె తెలిపారు.

**పాకాల :** మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాబ్జి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో గట్టి బందోబస్తు ఉంటుందన్నారు. 6 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు స్కూళ్లకు సంబంధించి మొత్తం 460 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

### అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి



ఆలయం వెలుపల జడ్జి వెంకటరమణ

**తిరుపతి రూరల్ :** తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి డి.వెంకటరమణ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రసాద్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### 19న చలో విజయవాడ



మాట్లాడుతున్న ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు

**తిరుపతి కల్చరల్:** ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా, మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తారన్న అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని, జీఓ నెం.2ను సవరించి అందరికీ మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు చలో విజయవాడ చేపడుతున్నట్లు తెలిపారు. ఆప్కాస్ రద్దు కారణంగా సుమారు లక్షా 25 వేల మంది కార్మికులు నష్టపోతారని తెలిపారు. ఈ సందర్భంగా చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి ఆప్కాస్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎంపిక

**తిరుపతి కల్చరల్:** తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ నూతన కమిటీని నగరంలోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం కన్వీనర్ బి.మునిరాజా నేతృత్వంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా రూపేష్, ప్రధాన కార్యదర్శిగా బాషా, కోశాధికారిగా మల్లిఖార్జున్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రూపేష్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, పలు ట్రావెల్స్‌కు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

# కన్ను పడితే కబ్జా..!

తిరుపతిని జిల్లాకేంద్రం అయినప్పటి నుంచి తిరుపతితో పాటు చుట్టుపక్కల ప్రాంతంలో భూముల రేట్లు అమాంతం పెరిగాయి. సెంటు భూమి ధర రూ.లక్షల్లో పలుకుతుండడంతో అధికారంలోకి వచ్చిన పచ్చనేతల చూపు ఆ భూములపై పడింది. ఏ పదవీ లేకున్నా.. ఖద్దర్ చొక్కా వేసుకునే చిన్నాచితక నాయకుల నుంచి నియోజకవర్గ ప్రజా ప్రతినిధి వరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలో తలా ఒక చేయి వేస్తున్నారు. ఇది చాలదన్నట్లు ప్రైవేటు భూముల్లో జోక్యం చేసుకుని వివాదాలు సృష్టిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు.. కొందరు పోలీసులు కూడా పచ్చనేతలకే సలాం కొడుతుండడం గమనార్హం.

- వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కనుమరుగు
- కళ్లెదుటే అన్యాక్రాంతం జరుగుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- తిరుపతిలో భూముల ధరలకు రెక్కలు రావడంతో పచ్చగద్దల కన్ను
- 30 రోజుల్లో దాదాపు రూ.50 కోట్ల విలువైన భూములు కబ్జా
- జిల్లా కలెక్టర్ అయినా ఆక్రమణలు అడ్డుకుంటారా ?



తుమ్మలగుంటలో సర్వే నంబరు 18/2 ఆక్రమిత ప్రభుత్వ భూమిలో ఏర్పాటైన మద్యం దుకాణం

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** తిరుపతి రూరల్ మండలంలో విలువైన భూములను కబ్జా చేయడానికి పచ్చనేతల పన్నాగాలు అన్నీ ఇన్నీ కావు. వారి కన్ను పడిందంటే.. భూమిని కాజేసేందుకు వారు వేసే గాలానికి ఎంతటి వారైనా చిక్కుకుని విలవిల్లాడాల్సిందే. వారికి కావాల్సిన భూమిని సదరు వ్యక్తులతో కుదిరితే రాజీ, లేదంటే బ్లాక్‌మెయిల్‌కు దిగుతారు. ఒక్క తిరుపతి రూరల్ మండలంలోని రెవెన్యూ శాఖ పరిధిలో 30 రోజుల వ్యవధిలో సుమారు రూ.50 కోట్లు విలువైన ప్రభుత్వ భూములు కాజేశారంటే భూ మాఫియా ఎంత రెచ్చిపోతోందో అర్థం చేసుకోవచ్చు. కోర్టుల్లో కేసులు నడుస్తున్నా లెక్క చేయడం లేదు. పచ్చనేతల బరితెగింపునకు రెవెన్యూ అధికారుల సహకారం తోడవడంతో విలువైన ప్రభుత్వ భూములన్నీ కనుమరుగవుతున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా కనిపించిన ప్రభుత్వ భూముల్లో రాత్రికి రాత్రే భవనాలు వెలుస్తుంటే చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇదేం ప్రభుత్వం రా నాయనా..? ఇంత దారుణమా ? అని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ భూ వివాదాల్లో కొందరు పోలీసులు కూడా తలదూర్చి తెలుగుదేశం పార్టీ నేతలకు వెన్నుదన్నుగా నిలుస్తుండడం కొసమెరుపు.

గత నెల రోజుల వ్యవధిలో జరిగినవి పరిశీలిస్తే..

తుమ్మలగుంట గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 18/2లో 0.76 ఎకరాల బండి బాటను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాజేశాడు. ఆ భూమిలో అనధికారికంగా ఓ షెడ్డును ఏర్పాటు చేసి అధికార పార్టీకి చెందిన వారికి ప్రైవేటు మద్యం దుకాణం నడుపుకునేందుకు అద్దెకు కేటాయించి ప్రతి నెలా రూ.లక్ష వరకు అద్దె వసూలు చేస్తుండడం గమనార్హం. ఈ విషయాన్ని ప్రధాన పత్రికలు అన్నీ పతాక శీర్షికల్లో వార్తలు రాయగా స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ దుకాణం గోడకు తాత్కాలిక బోర్డును ఏర్పాటు చేశారు. బోర్డు పెట్టిన తరువాత ఫొటో తీసుకుని ఆపై ఆక్రమణదారు చేతనే ఆ బోర్డును తీయించి వేయడం విశేషం. సదరు భూమి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని సమాచారం.

**రామానుజపల్లి పంచాయతీలో..**

రామానుజపల్లి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 121/5లో 1.29 ఎకరాల బండిబాట (ప్రభుత్వ భూమి)ని స్థానికంగా నివాసం ఉంటున్న అధికార పార్టీ తెలుగుదేశం నేతలు కాజేశారు. గ్రామ అవసరాల కోసం తరతరాలుగా ఉన్న ఆ భూమిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పచ్చ నేతలు దర్జాగా కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండాపోయిందని స్థానికులు చెబుతున్నారు. అయితే దినపత్రికల్లో వరుసగా వార్తలు రావడంతో అధికారులు కంటి తుడుపు చర్యగా ఆక్రమణదారుకు తహసీల్దారు కార్యాలయం నుంచి ఓ నోటీసు జారీ చేశారు. ఆ తరువాత చేతులు దులుపేసుకున్నారు. సదరు భూమిలో ఇప్పటికే రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఆ భూమి విలువ దాదాపు రూ.15 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

**మల్లంగుంట పంచాయతీలో..**

మల్లంగుంట గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 140లోని 1.03 ఎకరాల కాలువ భూమి ఉండగా అందులో అర ఎకరా భూమిని కబ్జా చేసి ఏకంగా ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించినా సరే ఎవరూ అటువైపు రావడం లేదని సమాచారం. అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత అడ్డగోలుగా సుమారు రూ.3 కోట్లు విలువైన కాలువ భూమిని ఆక్రమించి శాశ్వతంగా ప్రహరీ నిర్మాణం చేస్తుండడం, అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులకు ఆగ్రహం తెప్పిస్తోంది. పురాతన కాలం నాటి కాలువను పూడ్చి వేయడంతో మల్లంగుంట వాసులు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**సి.మల్లవరం పంచాయతీలో..**

సి.మల్లవరం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 320లోని చెరువు తొట్టి (ప్రభుత్వ భూమి)ని అదే పంచాయతీకి చెందిన గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న అధికార పార్టీకి చెందిన వ్యక్తులు అప్పనంగా దోచేశారు. ఆ భూమి విలువ దాదాపు రూ.2 కోట్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లేకున్నా జాతీయ రహదారికి ఆనుకుని ప్రభుత్వ భూమిని చదును చేసి నిర్మాణ పనులకు మట్టి కుప్పలు తోలించినట్టు సమాచారం. ఒక పక్క జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతుండగా భూ ఆక్రమణలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయి. కానీ రెవెన్యూ అధికారుల్లో మాత్రం చలనం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గాంధీనగర్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**పేరూరు పంచాయతీలో..**

పేరూరు గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 529/4ఎలో 0.98 ఎకరాల భూమిని కబ్జాదారులు దర్జాగా చదును చేసేశారు. తిరుపతి-చంద్రగిరి మార్గంలోని స్టాఫ్ క్వార్టర్స్ వద్ద గతంలో ఓ మాజీ ఎంపీకి, అదే గ్రామంలో నివాసం ఉంటున్న మరో వ్యక్తికి మధ్య నడుస్తున్న భూ వివాదం వెలుగులోకి వచ్చింది. సదరు నాటి ఎంపీ దానిని కాజేయాలని చూస్తున్నట్టు దినపత్రికల్లో వార్తలు వచ్చాయి. దాంతో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన ఆ ఎంపీని గట్టిగా మందలించినట్టు సమాచారం. అయితే ఇప్పుడు స్థానిక ప్రజాప్రతినిధి సమీప బంధువు రంగంలోకి దిగి చదును చేస్తుంటే అదే సీఎం చంద్రబాబుకు తప్పుగా కనిపించడం లేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆ భూమి విలువ సుమారు రూ.20 కోట్లకు పైగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.



రామానుజపల్లి సర్వే నంబరు 121/5లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలు



మల్లంగుంట సర్వే నంబరు 140లో కాలువ పూడ్చి ప్రహరీ చేపట్టిన నిర్మాణం



సి.మల్లవరం సర్వే నంబరు 320లో చెరువు భూమిని చదును చేసిన అక్రమార్కులు



పేరూరు సర్వే నంబరు 529/4ఎలో విలువైన భూమిని చదును చేసిన ఆక్రమణదారులు

## నగరంలో నేడు

- తిరుమల శ్రీవారికి సమస్యల వినతి సమర్పణ నేపథ్యంలో బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఉదయం 8.30 గంటలకు అలిపిరి నుంచి తిరుమలకు భక్తులతో పాదయాత్ర. ఈ మేరకు అలిపిరి వద్ద మీడియా సమావేశం
- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం 9 గంటల నుంచి క్రీడా పోటీలు
- టెన్త్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు ప్రారంభం
- ఏపీపీఎస్సీ ఏపీ ఫారెస్ట్ రేంజ్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రాత పరీక్షలు
- పట్నాల వీధిలోని శ్రీరేణుకా పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పుష్పకాంతి యాగం
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై అంతర్జాతీయ కార్యశాల
- మెగా కార్పొరేట్ టీ-20 క్రికెట్ లీగ్ సెవెన్త్ ఎడిషన్-2025లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో ఉదయం 8 గంటల నుంచి తిరుపతి కలెక్టరేట్ వర్సెస్ అమర రాజా జట్లు క్రికెట్ లీగ్ పోటీలు. అలాగే మధ్యాహ్నం 1.30 నుంచి తిరుపతి డాక్టర్స్ వర్సెస్ ఏపీఎస్‌పీడీసీఎల్ జట్ల క్రికెట్ లీగ్ పోటీలు.
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహణ
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఉదయం 10 గంటలకు దక్షిణ భారత వేద సమ్మేళనం ప్రారంభం. దీనికి ముందు ఉదయం 8 గంటలకు వేద పండితులు, విద్యార్థుల శోభాయాత్ర
- నేడు ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ బ్యూరో, అక్షరా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్‌లో 'శేషాచలం-బయోడైవర్సిటీ' అనే అంశంపై సదస్సు
- వేదిక్ వర్సిటీలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనం ప్రారంభం

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**తిరుపతి తుడా:** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 0877-2227208 నంబర్ నుంచి ఫోన్ ఇన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, అలాగే ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు నేరుగా స్వీకరించేందుకు ఉదయం 10.30 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం

– వైఎస్సార్‌సీపీ చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**తిరుపతి రూరల్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్ట పరుచుకునేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలని చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. రామచంద్రాపురం మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డితో పాటు అదే మండలానికి చెందిన సుమారు వందమంది పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు అందరూ మర్యాద పూర్వకంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆయన ఇంటి వద్ద ఆదివారం కలిశారు. మండల పార్టీకి నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డిని ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి శాలువతో సత్కరించి పార్టీ పురోభివృద్ధికి కష్టపడి పని చేయాలని ఆకాంక్షించారు.



ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డిని సత్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

అనంతరం వారు సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. చివరిలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రామచంద్రాపురం వైఎస్సార్‌సీపీ, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అమరజీవికి నివాళి

**తిరుపతి గాంధీ రోడ్డు:** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని తిరుపతి రుయా హాస్పిటల్ ముందు ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు ఆదివారం అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితంగానే నాడు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో..**

ఎస్పీ కార్యాలయంలో జిల్లా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి

**తిరుపతి కల్చరల్:** భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలం అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ కొనియాడారు. అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ ఆనందరాజు, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

**తిరుపతి రూరల్ :** తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో జరిగే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన కల్పవార్షిక ఆర్ట్స్ అకాడమీ బృందం వారు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. గురువు తిరుమలై రమ్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలను ప్రేక్షకులకు కనువిందు చేసింది. చెన్నైకి చెందిన కల్పశ్రీ నృత్యాలయం తరఫున ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కల్పవార్షిక ఆర్ట్స్ అకాడమీ బృందం ప్రతినిధులతో పాటు నాట్య ప్రదర్శన చేసిన నృత్యకారులను శిల్పారామం ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించారు.



నాట్య ప్రదర్శన చేస్తున్న నృత్యకారులు

## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల:** తిరుమల శ్రీవారిని ఆదివారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ, మాజీ జస్టిస్ సత్యనారాయణమూర్తి, ఐఏఎస్ అధికారి కృష్ణతేజ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.



ఐఏఎస్ అధికారి కృష్ణతేజ

### సాహితీ సేవకులకు మాధురీ పురస్కారాలు

**తిరుపతి కల్చరల్:** తెలుగు కళారత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యూత్‌హాస్టల్లో పలువురు సాహితీ సేవలకు మాధురీ పురస్కారాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈమేరకు ఆదివారం యూత్ హాస్టల్లో తెలుగు భాషా పరిరక్షణపై చేపట్టిన జానపద పద్యగానం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జానపద కళాకారులు రెడ్డెప్రసాద్, రెడ్డెప్ప, రాజశేఖర్, ధనాసి ఉషారాణి తెలుగు భాష విశిష్టతపై జానపద పద్యాలను ఆలపించి తెలుగు భాష మాధుర్యాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన షీ టీం ఆఫీసర్ సుమతి, శ్రీపద్మావతి మహిళాడిగ్రీ కళాశాల హెచ్ఓడీ కృష్ణవేణి, నిర్వాహకురాలు డాక్టర్ ధనాశి ఉషారాణి, పలువురు సాహితీ సేవకులు, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం, తెలుగు మహిళా అధ్యక్షురాలు హేమలతను మాధురీ పురస్కారాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సుమారు వంద మంది కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.



కథా రచయిత బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

### పేద ముస్లిం కుటుంబానికి ఆపన్న హస్తం

**తిరుపతి సిటీ:** తిరుపతి ఎల్బీ నగర్‌లో నివాసం ఉంటున్న నిరుపేద ముస్లిం కుటుంబాన్ని గీతాగోవిందం సేవా సమితి ట్రస్ట్ సహాయంతో నిత్యావసరాలు అందించామని ఎస్వీయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కోటగారం మురళి తెలిపారు. రంజాన్‌మాసం సందర్భంగా కనీసం తినడానికి తిండి దొరకని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న కుటుంబానికి గీతా గోవిందం ట్రస్ట్ ఆపన్నహస్తం అందించడం అభినందనీయమన్నారు. కుటుంబ యజమాని మరణించినప్పటి నుంచి కాలువిరిగి లేయలేని స్థితిలో మంచానికే పరిమితమైన పండుటాకు దీనస్థితిని గమనించి గీతాగోవిందం ట్రస్ట్‌కు తెలియజేయడం జరిగిందన్నారు. వెంటనే వారు స్పందించి బియ్యంతో పాటు రూ.2 వేలు విలువ చేసే నిత్యావసరాలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దామోదరం, ట్రస్ట్ సభ్యులు బాలగుర్రప్ప, ప్రొఫెసర్ వరదరాజులు, కాకులూరు గుణశేఖర్, ఉమాపతి, డాక్టర్ గోపాలకృష్ణ, ఉమాదేవి, వెంకటరమణ పాల్గొన్నారు.



నిత్యావసరాలను అందజేస్తున్న మురళి, ట్రస్ట్ సభ్యులు

### క్రెడాయ్ నూతన కమిటీ ఎంపిక

**తిరుపతి కల్చరల్:** క్రెడాయ్ సంస్థ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ఈమేరకు క్రెడాయ్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్రెడాయ్ సంస్థ చైర్మన్‌గా కె.గోపీనాథ్, అధ్యక్షుడిగా ఎం.రామప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎ.రాజేష్‌బాబు, సహాయ కార్యదర్శిగా పి.శ్రీనాథ్‌రెడ్డి, కోశాధికారిగా పి.నరసింహారెడ్డి నియమితులయ్యారు. అనంతరం ఎం.రామప్రసాద్ అధ్యక్షతన సంస్థ అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రెడాయ్ కార్యక్రమాలతో పాటు ప్రజాహిత కార్యక్రమాల ప్రాధాన్యత గురించి వివరించారు. నూతన కమిటీ ఎన్నికల అధికారి వెంకయ్యకు అందరూ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థ రాష్ట్ర కోశాధికారి పి.రాజశేఖర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రెడాయ్ అధ్యక్షుడు రామప్రసాద్

### ఉచిత మెగా వైద్యశిబిరం

**పాకాల :** మండలంలోని దామలచెరువులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక శ్రీ మంజునాథ క్లినిక్ ఆధ్వర్యంలో తిరుపతి రష్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత సిపాయి సుబ్రమణ్యం సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో మొత్తం 170 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను సరఫరా చేశారు. కిడ్నీలో రాళ్లు, హెర్నియా, ప్రొస్టేట్ సమస్యలు ఉన్న 16 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయచంద్ర పాల్గొన్నారు.